


గరుడ వాహనంపై సౌమ్యనాథుడు



ప్రజాశక్తి-నందలూరు

నందలూరు బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి సౌమ్యనాథ స్వామి శ్రీ మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారు గరుడ వాహనంపై గ్రామోత్సవానికి బయలుదేరి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణా చేసి అనంతరం దిగువ వీధి, పేటగడ్డ, బస్టాండ్ మీదుగా అరవపల్లి వరకు గ్రామోత్సవం కొన సాగింది. అరవపల్లిలో శ్రీమన్తు మర్రమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన వేదిదిలో ఉభయదారులను మంగళ వాయిద్యాలతో ఆహ్వానించి పూజలు జరిపించారు. అనంతరం గ్రామోత్సవం అరవపల్లి లోని రైల్వే కాలనీ మరికొన్ని వీధుల్లో ఊరేగుతు బ్రాహ్మణ వీధికి చేరుకున్నారు. ఉదయం పుష్పాలంకార ప్రియులైన శ్రీసౌమ్య స్వామి మోహిని అలంకారంలో శేష వాహనంపై మాడవీధులలో ఊరేగుతూ భక్తకోటికి సన్మోహితులను చేశారు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. శుక్రవారం ఉదయం సౌమ్యనాథ స్వామి ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యాయత్నం

- కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఘటన
- చదువు కోవడం ఇష్టం లేకనే ఇలా చేశామన్న విద్యార్థులు
- విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- కౌన్సెలింగ్ ఇవ్వాలని డాక్టర్లు, ఉపాధ్యాయులకు సూచన



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హాస్టల్లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులు అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం రాత్రి అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. కురబలకోట మండలం, ముదివేడు సమీపంలో ఉన్న కస్తూర్బా గురుకుల పాఠశాలలో సిటిఎంకు చెందిన హరినాథ్, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె హర్షిత, మదనపల్లె అనుపగుట్టకు చెందిన సురేంద్ర, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె సంజన, కదిరికి చెందిన పద్మావతి కుమార్తె రెడ్డి జాహ్నవి 9వ తరగతి చదువుతున్నారు. వీరితో పాటే చదువుతున్న మరో విద్యార్థి మదనపల్లెకు చెందిన యశశ్విత రెండు వారాల కిందట టిసి తీసుకుని ఇంటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి వీరికి చదువుకోవడం ఇష్టం లేకుండా పోయింది. తాము కూడా ఇంటికి వెళ్లిపోవాలని ఆలోచన చేశారు. అందుకు తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. బుధవారం సాయంత్రం తమ వద్ద ఉన్న పారాసెటమాల్, డైక్లోఫినాక్ మాత్రలను ఒక్కొక్కరు 10 చొప్పున తీసుకున్నారు. రాత్రి పడుకునే సమయంలో వీరికి ఒక్కసారిగా వాంతులు రావడంతో పాఠశాలలోని వార్డెన్, స్టాఫ్ నర్స్, తోటి విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వెనువెంటనే విద్యార్థులను మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎలాంటి అపాయం లేదని వారిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గురువారం సర్వజన బోధన ఆసుపత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఎందుకోసం ఇలా చేశారని వారిని విచారించగా తమకు ఈ పాఠశాలలో చదువుకోవడం ఇష్టం లేక ఇలా చేశామని చెప్పుకొచ్చారు. ఇలా చేయడం మంచి పద్ధతి కాదని ఎమ్మెల్యే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అక్కడి డాక్టర్లకు పిలిచి విద్యార్థులకు మంచి వైద్యం చేయాలని, కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులతో సైతం మాట్లాడిన ఎమ్మెల్యే పిల్లలను ఎక్కువ ఒత్తిడి చేయొద్దని, కొద్ది రోజులు మీ వద్ద పెట్టుకొని సర్ది చెప్పి ఆ తర్వాతనే స్కూల్‌కు పంపమని తెలియజేశారు. సంఘటన తెలుసుకున్న కురబలకోట ఎంఇఒ, మదనపల్లె ఎంఇఒ వెళ్లి బాధిత విద్యార్థులను ఆస్పత్రిలో పరామర్శించి ధైర్యం చెప్పారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్ సైతం విద్యార్థులు, స్టాఫ్ నర్సు భానుప్రియ, తల్లిదండ్రులను విచారించి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పూర్వ ఆర్‌జెడి రాఘవరెడ్డి అవినీతిపై విచారణ

- ఆధారాలు సమర్పించిన యుటిఎఫ్ నాయకులు



ఆధారాలు సమర్పిస్తున్న కడప జిల్లా యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

పూర్వ ఆర్‌జెడి వై.రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై డిఇఒ కార్యాలయంలో గురువారం విచారణ అధికారి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ డాక్టర్ ఎంఆర్.ప్రసన్న కుమార్ ఆరోపణలపై విచారణ చేపట్టారు. రాఘవరెడ్డి కడప జిల్లాలో విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే వివాదాస్పద అధికారిగా పేరు గాంచారు. అధికార పార్టీ అండదండలు తనకున్నాయనే ప్రచారంతో ఉపాధ్యాయుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, ఉపాధ్యాయులను వేధించడం, ప్రశ్నించిన వారిని అక్రమంగా సస్పెన్షన్లు చేయడం, షోకాజు నోటీసులు జారీ చేయడం పరిపాటిగా మారింది. ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు రాఘవరెడ్డి వైఖరిపై గళమెత్తారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కలెక్టర్, గవర్నర్‌కు రాఘవరెడ్డి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. రాఘవరెడ్డికి అధికార పార్టీ అండదండలు ఉండడంతో అవినీతిపై చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి రావడంతో రాఘవరెడ్డిపై గతంలో ఎమ్మెల్సీతో పాటు ఉపాధ్యాయ సంఘాలు చేసిన ఫిర్యాదుపై ప్రసన్న కుమార్‌ను విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ ఆరోపణలపై గురువారం విచారణ అధికారి విచారణ చేపట్టారు. గతంలో ఫిర్యాదు చేసిన యుటిఎఫ్ సంఘాన్ని విచారణ అధికారి విచారణకు పిలవడంతో యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు విచారణకు హాజరై అవినీతి, అక్రమాలపై పలు ఆధారాలను విచారణాధికారికి సమ ర్పించారు. ఈ సందర్భంగా విచారణ అధికారితో వారు మాట్లాడుతూ వై.రాఘవరెడ్డి జిల్లాలో డిఇఒగా నియమించబడినప్పటి నుంచి అవినీతి అక్రమాలే పరమావధిగా కొనసా గారన్నారు. ఉపాధ్యాయులను దూషించడం, ప్రశ్నించిన వారిని సస్పెండ్ చేయడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఆయన నైజమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యా యులు తమ సమస్యలపై ఆందోళన చేపట్టడానికి వీలు లేదంటూ వివాదాస్పద ఉత్తర్వులు జారీ చేసి తన పెత్తందారి పోకడలను విద్యాశాఖలో ప్రవేశపెట్టారన్నారు. గత ఏడాది జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో చేతివాటం ప్రదర్శించి ఇష్టా రాజ్యంగా తనకు అనుకూలురైన వారికి అనుకూలమైన స్థానాలు కట్టబెట్టాడని తెలిపారు. విద్యాశాఖను ప్రభుత్వ సంస్థగా కాకుండా, తన సొంత జాగీరుగా మార్చివేశారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తనకు అర్హత లేకపో యినా యుజిసి స్కేల్‌ను అక్రమంగా పొందాడని, ఈ విషయంలో పాఠశాల విద్యా కమిషనర్ అక్రమంగా పొందిన అదనపు వేతనాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని ఆదేశాలు ఇచ్చినా పెడచెవిన పెట్టారని విమర్శించారు. డిఇఒగా ఆయనపై పలు ఆరోపణలున్నా కడప జిల్లాలోనే ఆర్‌జెడిగా పదోన్నతి కల్పించారని తెలిపారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో పాటు ఎయిడెడ్ ఉపాధ్యాయులను, కరస్పాండెంట్‌లను సైతం ఆయన వేధించారని వివరించారు. ప్రభుత్వం స్పందించి పూర్వ ఆర్‌జెడిని ప్రభుత్వానికి సరెండర్ చేయడం మంచి పరిణామమైనా, ఆయన చేసిన అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విచారణ అధికారికి విజ్ఞప్తి చేశారు. విచారణ అధికారి ఎంఆర్.ప్రసన్నకుమార్ స్పందిస్తూ రెండు రోజులపాటు పూర్వ ఆర్‌జెడిపై వచ్చిన ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. విచారణకు పలు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో పాటు పలువురు బాధితులు విచారణకు హాజరై రాఘవరెడ్డి వైఖరిపై ఫిర్యాదులు చేశారు.

పేదలకు సాయం చేయడం సంతృప్తినిస్తుంది : మంత్రి



వినతులు స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

పేదలకు సాయం చేయడంలో ఎంతో సంతృప్తిగా ఉంటుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి ఎస్ఎన్ కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తన మొదటి నెల జీతం నుంచి కొంత మొత్తం తీసి ముస్లిం మైనార్టీ కుటుంబంలో జరుగు తున్న వివాహ ఖర్చులకు కానుకగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సాయం చేయడంలో ఎంతో సంతృప్తిగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత మొత్తం పేదలకు సాయం చేసి ఆదుకోవాలని తెలిపారు. పేదలకు సాయం చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని కోరారు. వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుంచి వచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని వారికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న అంకన్న

కేంద్రీకృత నియామక విధానాన్ని రద్దు చేయాలి

- పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న

ప్రజాశక్తిరాయచోటి

గిరిజన విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ లోని ఉపాధ్యాయులు భర్తీకి ప్రస్తుతం ఉన్న కేంద్రీకృత రిక్రూట్మెంట్ ప్రక్రియను తక్షణమే వెనక్కి తీసుకోవాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న డిమాండ్ చేశారు.రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బిసి బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లోని షెడ్యూల్ తెగ(ఎస్‌టి) విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉన్న స్థాయి విద్యను అందించాలని కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పడిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలలో ఉపాధ్యాయుల భర్తీకి ప్రస్తుతం ఉన్న కేంద్రీకృత రిక్రూట్మెంట్ పద్ధతిని తక్షణమే వెనక్కి తీసుకోవాలిన్నారు. రాబోయే ఐదేళ్లలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లోని 38 వేల మంది సిబ్బందిని కేంద్ర సంస్థ నేషనల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ ద్వారా రిక్రూట్ చేస్తుందని గత బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు అన్నారు. గిరిజన విద్యార్థుల ప్రయోజనాలు కలగాలంటే ఇఎంఆర్ పాఠశాలలలో బోధన, బోధనేతర సిబ్బందికి కచ్చితంగా విద్యార్థులు మాట్లాడే భాష తెలిసి ఉండాలిన్నారు. కానీ కేంద్రీకృత రిక్రూట్మెంట్ పద్ధతి వల్ల ఇది అసాధ్యంగా ఉందిన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 28, తెలంగాణలో 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయినీ తెలంగాణలోని నేషనల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ఇఎస్టిఎస్) కేంద్రీకృత రిక్రూట్మెంట్ పద్ధతిలో 47 మందిని నియమిస్తే 44 మంది హర్యానా రాష్ట్రానికి చెందిన వారేనన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఒక్కరు కూడా లేరున్నారు. దీనివల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందిన్నారు. తక్షణమే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో కేంద్రీకృత రిక్రూట్మెంట్ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ పిడిఎస్‌యు నాయకులు రూపేష్, ఈశ్వర్,మోహన్, ధనంజయ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-రాయచోటి

కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ గర్ల్స్ ఐటిఐ కాలేజ్ ప్రక్కన తిరుపతి రోడ్డు కడప వారి ఆధ్వర్యంలోవారి ఆధ్వర్యంలో ఏసి రిపేర్స్, సెల్ ఫోన్లు రిపేర్లు, ఫోటో గ్రఫీ, వీడియో గ్రఫీ లపై గ్రామీణ యువకులకు ఆగస్టు 1 నుంచి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాట్లు కెనరా బ్యాంక్ స్వయం ఉపాధి సంస్థ వారు ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు కల గ్రామీణ నిరుద్యోగ యువకులు పై శిక్షణా కార్యక్రమాలకు గ్రామీణ ప్రాంతాల యువకులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాలలోని అర్హులైన నిరుద్యోగ యువకులు ఈ ఉచిత శిక్షణ తరగతుల కొరకు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో కడపలో ఉన్న కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థకు వెళ్లి రిజిస్టర్ చేసుకో వాలని సూచించారు. వివరాల కోసం 9440905478 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఇంటింటి కుష్టు వ్యాధిగ్రస్థుల సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య అన్నారు. గురువారం పట్టణంలోని వాల్మీకివీధిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఎల్‌సిడిసి(కుష్టు వ్యాది గ్రస్థుల గుర్తింపు సర్వే) కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న కుష్టు వ్యాధి గ్రస్థులను గుర్తించి వారికీ నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా చికిత్స అందించాలన్నారు. ప్రతి వక్కరు కుష్టు రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈనెల 18వ తేదీ నుండి ఆగస్టు 2వ తేదీ వరకు ఆశాకార్యకర్తలు, ఎంపిక చేసి శిక్షణ పొం దిన మగ కార్యకర్తలు ద్వారా ఇంటింటి కుష్టు వ్యాధి సర్వే నిర్వహిస్తారన్నారు. స్పర్శ, నొప్పి లేని మచ్చలు శరీరంలో ఏ భాగం లో నైనా ఉండవచ్చు అని ఇలాంటి మచ్చలను చూపించి కుష్టు వ్యాధి కాదని నిర్ధారణ చేసుకోవాలన్నారు. కుష్టు వ్యాధికి నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు పడాలని అన్నారు. కావున ప్రజలు ఈ సర్వే కు సహకరించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ, డిఎన్ఎంఒ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పిఎంఒ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న అకృత్యాలు : ఐద్వా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళలు, చిన్నారులపై ఇటీవల కాలంలో అకృత్యాలు పెరిగిపోతున్నాయని, కామాంధులను కఠినంగా శిక్షించాలని ఐద్వా కన్వీనర్ భాగ్యమ్మ డిమాండ్ చేశారు. గురువారం పట్టణ పట్టణ కమిటీ సమావేశంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏదో ఒకచోట వీరిపై ఆకృత్యాలు జరుగుతున్నాయన్నారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో చిన్నారి వాసంతిపై జరిగిన ఘటన మరువకనే గుంటూరు జిల్లా కొత్తరెడ్డి పాలెంకు చెందిన 8వ తరగతి శైలజ (ఎస్సీ విద్యార్థిని) గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజు ఇంటిలో మ ృతదేహమై కనిపించడం అమానుషమన్నారు. అంతలోనే విజయనగరం జిల్లా రామభద్రపురంలో ఆరు నెలల చిన్నారిని తాత వరుస అయ్యే వ్యక్తి అత్యాచారం చేయడం చాలా సిగ్గుచేటుగా ఉంది. అనకాపల్లిలో కూడా 13సం. బాలికపై హత్యాచారం జరిగిందన్నారు. ఈ నరరూప రాక్షసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి కామాంధులను నడిరోడ్డుపై కాల్చి చంపినప్పుడే ఆడపిల్లలకి, మహిళలకు రక్షణ ఉంటుందన్నారు. చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి త్వరగా శిక్షలు విధించాలనీ, ముఖ్యంగా సోషల్ మీడియాలో యూట్యూబ్‌లో వాట్సాప్‌లో ఫేస్‌బుక్‌లో, సినిమాలు సీరియల్స్‌లో వస్తున్నటువంటి అశ్లీల దృశ్యాలు, చిత్రాలు మహిళలను కించపరిచే విధంగా ఉన్న దృశ్యాలే ఇలాంటి వాటికి దారితీస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటువంటి వాటిపై ప్రభుత్వం చర్య తీసుకుని వాటిని బ్యాన్ చేయాలి. ప్రజలకు మేలు చేసే విధంగా సోషల్ మీడియా రూపకల్పన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జి రాజమ్మ, రెడ్డి ప్రసన్న, పి.భాను, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-రాయచోటి

మట్టి విగ్రహాలతోని పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు తయారుచేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వినాయక చవితి, దుర్గాపూజ పండుగలకు తయారుచేసే విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్తో తయారు చేయవద్దని విగ్రహ తయారీదారులకు సూచించారు. జిల్లాలో వర్షపాతం తక్కువగా ఉంటుందని, మనకుపడే ఆ తక్కువ వర్షాన్ని, నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని తెలిపారు. తాగునీటికి సమస్య ఏర్పడుతుందని, మొత్తంగా పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. తమ వంతు బాధ్యతగా మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని సూచించారు

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి వాహనాలపై దాడి హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యేమ గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలచే ఎన్నుకోబడిన ఎంపీ బుధవారం పుంగనూరు పర్యటనలో భాగంగా మాజీ ఎంపీ రెడ్డెప్ప స్వగృహానికి వెళ్తే టిడిపికి చెందిన వందలాది మంది వచ్చి రాళ్ళ దాడిచేసి వాహనాలను ధ్వసం చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. టిడిపి అధికారంలోకి వచ్చినప్పటీ నుంచీ వరుసగా జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల ధ్వసం, కూల్చివేతల సంఘటనలు ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు జరగలేదన్నారు. ఈ పరిస్థితులను పోలీసులు వెంటనే చక్కదిద్దే భాధ్యతను తీసుకుని అందరికీ రక్షణ కల్పించాలని కోరారు. వినుకొండలో అందరూ చూస్తుండగానే వైసిపి నాయకుడు రషీద్‌ను అతి కిరాతకంగా హత్యచేయడం, తదితర సంఘటనలను చూస్తే ఈ రాష్ట్ర పరిస్థితి ఎక్కడికి పోతుందోనని ఆయన ఆందోళన, ఆవేదనను వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు ముచ్చుమర్రిలో తొమ్మిదేళ్ల బాలిక అత్యాచారానికి గురై, హత్యకు గురైన బాలిక మృతదేహం ఆచూకీని ఇంతవరకు కనుగొనకపోవడం దారుణమన్నారు.తక్షణమే ఇటువంటి సంఘటనలను సరిదిద్ది, శాంతి భద్రతలను కాపాడి ప్రజల కోసం పనిచేసే విధంగా ప్రభుత్వం నిరూపించుకోవాలని అయన విన్నవించారు. **మదనపల్లె అర్బన్ :** పుంగనూరు పట్టణంలో ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్పలపై టిడిపి శ్రేణులు దాడులు తెగబడడం మంచి సంస్కృతి కాదని వైసిపి మదనపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్ పేర్కొన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎంపీ ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి వస్తే టిడిపి శ్రేణులు అడ్డుకొని దాడులకు తెగబడడం విష సంస్కృతి అని తెలిపారు. రాజకీయం శాశ్వతం కాదని ప్రతి ఒక్కరూ రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ఎంపీపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.



క్రీడాకారులను అభినందిస్తున్న జగన్‌మోహన్‌రాజు

యువత క్రీడల్లోనూ రాణించాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడలలోనూ రాణించాలని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించిన సందర్భంగా గురువారం జగన్‌మోహన్‌రాజు అతిథి గృహంలో క్రీడాకారులకు బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్, ఐడెంటిటీ కార్డులు ఆయన చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట క్రీడాకారులు ఆత్మ రక్షణ విద్యలో అత్యున్నత స్థాయికి చేరుకోవడం అభినందనీయమని అన్నారు. నేటి సమాజంలో మార్షల్ ఆర్ట్స్ వంటి ఆత్మ రక్షణ విద్య ప్రతి ఒక్కరికి అవసరమని పేర్కొన్నారు. యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ప్రపంచం గర్వించదగ్గ దేశ పౌరులుగా నిలబడగలుగుతారని అన్నారు. అకాడమీ గ్రాండ్ మాస్టర్ సునీల్ మాట్లాడుతూ ఏప్రిల్ 28న తిరుపతిలో జరిగిన బ్లాక్ బెల్ట్ పరీక్షలలో కె.గంగారామ్, సి.చరణ్ కుమార్‌లు ప్రతిభ చూపి బ్లాక్ బెల్ట్ సాధించారని తెలిపారు. అనంతరం అకాడమీ ఆధ్వర్యంలో జగన్మోహన్ రాజును శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డిఆర్ఎల్ మణి, మండల ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, మాజీ మండలాధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, ఒంటిమిట్ట మాజీ ఎంపిపి లక్ష్మీనారాయణ, సిద్ధవటం మాజీ జడ్‌పిటిసి చలమయ్య యాదవ్, సుధాకర్ రాజు, ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, మాస్టర్లు టి.చంద్రశేఖర్, కె.గంగారామ్, సి.చరణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

లయన్స్ క్లబ్ అధ్యక్షులు నరసింహారాజు ఆర్థిక సహకారంతో గురువారం మండల పరిధిలోని పోలి గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ పోలి గిరిజన కాలనీలో గత 20 సంవత్సరాలుగా విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించి దేశానికి, సమాజానికి ఉపయోగపడాలని సూచించారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి పిడికిటి సంతోష్, కోశాధికారి కెఎస్.నరసింహ,క్లబ్ సీనియర్ ప్రతినిధి షేక్ అబ్దుల్లా, పెనిగలపాటి చంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు రమణ పాల్గొన్నారు.



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం : ఎంపిపి



మాట్లాడుతున్న ఎంపిపి సతీష్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

మండల ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి సమన్వయంగా కృషి చేద్దామని ఎంపిపి కంభం సతీష్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పీలేరు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. అంటూ వ్యాధులు రాకుండా నీటి ట్యాంకులు శుభ్రంగా ఉంచాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఎఇ నాగరాజ నాయక్ మాట్లాడుతూ తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ కోసం ప్రత్యేకమైన బిళ్ళలు అందుబాటులో ఉన్నాయని వాటి ద్వారా పంచాయితీల్లో నీటిని క్లోరినేషన్ చేసి తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. మేళ్లచెరువు ఎంపిటిసి కిరణ్ కుమార్ మాట్లాడుతూ మేళ్లచెరువు మండలంలో మారుమూల గ్రామమని, తమ గ్రామానికి ఉన్న నాలుగు బస్సు సర్వీసులను ప్రస్తుతం రెండు సర్వీ సులకు కుదించడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతు న్నారన్నారు. అధికారులు స్పందించి మిగిలిన రెండు బస్సు సర్వీస్‌లను కూడా కొనసాగించాలని కోరారు. ఇటీవల ఖరీఫ్ రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేసిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలు నాసిరకంగా ఉండడంతో అవి మొలకెత్తక అన్నదాతలు నష్టపోయే పరిస్థితి ఉందని చెప్పారు. స్పందించిన ఏఓ రమాదేవి మాట్లాడుతూ రైతులకు సరైన అవగాహన లేక విత్తనాలు ఇష్టానుసారం విత్తడం వల్లే ఆ పరిస్థితి ఉందని చెప్పారు. ఆర్టీసీ బస్సుల సర్వీస్ విషయమై ఎంపిడిఒ ఉపేంద్రరెడ్డి స్పందిస్తూ ఆర్టీసీ అధికారులతో చర్చించి విషయం తెలియజేస్తానని సమాధానం ఇచ్చారు. దొడ్డిపల్లి ఎంపిటిసి శ్యామల మాట్లాడుతూ ఇటీవల అన్నంగి హరిజనవాడలో జరిగిన పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమంలో కాలనీకి విద్యుత్ స్తంభాల అవసరం ఉందని అధికారుల దృష్టికి తీసుకు రావడం జరిగిందన్నారు. ఇప్పటివరకు వాటిని సంబంధిత అధికారులు సమకూర్చలేదని సమావేశం దృష్టికి తెచ్చారు. ఎంపిడిఒ ఉపేంద్రరెడ్డి సమాధానమిస్తూ ఈ సమస్యను ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులకు తెలియజేశానని త్వరలో ఆ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో అంటు వ్యాధుల నివారణపై విస్తృత ప్రచారం జరుగుతోందని తెలిపారు. గురువారం నుంచి కుష్టు వ్యాధి నివారణ, నియంత్రణపై కూడా సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ప్రజలు తమతో సహకరించేలా ప్రజాప్రతినిధులు చూడాలని కోరారు. సమావేశంలో ఎంపిడిఒ ఉపేంద్రరెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ, వైస్ ఎంపిపిలు హరిత, వెంకటాచలపతి, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న వెంకట్

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రామాపురం

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల బాలవీరాంజనేయస్వామికి బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలల సంఘం ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ గురువారం అమరావతిలోని మంత్రి చాంబర్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం సమ ర్పించామని చెప్పారు. గురుకులంలో ఇటీవల రిటైర్మెంట్ అయ్యి ఖాళీ అయిన పోస్టులకు వెంటనే నోటి ఫికే షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని, వాచ్‌మెన్‌ల సమస్యలను పరిష్కరిం చాలని వినతి పత్రంలో కోరారు. త్వరలో ఉద్యోగ సంఘాలు, అధికారులతో సమావేశాలు జరిపి సమ స్యల పరి ష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంపె మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయ కులు సంఘం అధ్యక్షులు జి.లక్ష్మీ నారాయణ, మహిళా విభాగం అధ్యక్షులు మెర్సీకుమారి, ఐటి విభాగం నాయకులు క్రాంతికుమార్, అబ్దుల్లా పాల్గొన్నారు.

గుండెపోటుతో లారీలోనే కుప్పకూలిన క్లీనర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నెల్లూరుకు చెందిన లారీ క్లీనర్ గురువారం మదనపల్లెలో గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నెల్లూరు పట్టణానికి చెందిన జాకీర్ (45) అదే ప్రాంతానికి చెందిన లోకేష్‌రెడ్డి లారీకి క్లీనర్‌గా వెళ్తున్నాడు. మదనపల్లె టమోటా మార్కెట్ యార్డు నుంచి టమోటాల లోడు తీసుకుని వెళ్లేందుకు డ్రైవర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డితో కలిసి క్లీనర్ జాకీర్ గురువారం మదనపల్లెకు వచ్చాడు. స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద లారీ నిలుపుకొని అందులో భోజనం చేసేందుకు భోజన పొట్లం విప్పే సమయంలో అలాగే కుప్పకూలిపోయాడని తెలిపారు. డ్రైవర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి అదే లారీలో స్థానిక సర్వజన బోధన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జాకీర్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని అన్నారు. వెంటనే మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

రేపు నిమ్మనపల్లి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన ఈనెల 20న శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ షాలెట్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మదనపల్లె శాసనసభ్యులు షాజహాన్‌బాషా హాజరవుతున్నట్లు తెలిపారు. మండల మీట్‌ను స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఉదయం గం.11 జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను తీసుకురావాలని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి-కలకడ

ప్రతి వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలని పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడలోని పురవీధులలో ఉన్న కాలువలను శుభ్రం చేయించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం వేయకూడదని సూచించారు. ప్రతి వ్యక్తి వ్యక్తిగత పరిశుభ్రత చూపి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు వీలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

బ్లీచింగ్ పౌడర్ సిద్ధంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామ పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ కార్యాలయంలో బ్లీచింగ్ పౌడర్, సున్నం సిద్ధంగా ఉంచాలని ఇఒపిఆర్‌డి శేఖర్ నాయక్ పేర్కొన్నారు. స్కీమ్ మోటార్ల వద్ద పైప్‌లైన్ దెబ్బతిని ఉంటే అక్కడ నీరు నిల్వ ఉండే పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.



అండర్ బ్రిడ్జి స్థలం పరిశీలిస్తున్న సాధన సమితి నాయకులు

రైల్వే అండర్ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైల్వే అండర్ బ్రిడ్జి వెంటనే నిర్మించి ప్రజల కష్టాలకు స్వస్తి పలకాలని ఆర్‌యుబి సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. గురువారం అండర్ బ్రిడ్జిని సందర్శించి ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా అండర్ బ్రిడ్జి సాధన సమితి నాయకులు మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌కు అవతలవైపు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, ఉన్నత పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయని రైల్వే అండర్ బ్రిడ్జి లేకపోవడం వలన ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అండర్ బ్రిడ్జి లేకపోవడం వలన ఆ మార్గంలో జన సంచారం తగ్గిపోవడంతో చిన్న చిన్న వ్యాపారులు దుకాణాలు మూసుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వేలాది మంది ప్రజల సౌకర్యార్థం అండర్ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, నాయకులు నాగోతు రమేష్ నాయుడు, 13వ వార్డు కౌన్సిలర్ గుణకల చిన్న, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, చంద్రశేఖర్ రాజు, హుస్సేన్, మహ్మద్ బాషా, గునకల సుధాకర్ పాల్గొన్నారు.

కోత అనంతరం కొమ్మ కత్తిరింపులు చేయాలి

ప్రజాశక్తి-నందలూరు

మామిడికాయల కోత అనంతరం కొమ్మ కత్తిరింపులు చేయాలని రాజంపేట ఉద్యాన శాఖ అధికారి సురేష్ బాబు పేర్కొన్నారు. గురువారం నాడు మండలం లోని లేబాక, నల్లతిమ్మాయిపల్లి రైతు సేవ కేంద్రాల పరిధిలోని మామిడి రైతులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి తోటలలో కాయల కోత అనంతరం కొమ్మలు కత్తిరింపులు ద్వారా అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలు, ఎండు పుల్లలు తొలగించాలని రైతులకు తెలియచేశారు. గుబురుగా పెరిగిన చెట్లల్లో సూర్యరష్మి ,గాలి, వెలుతురు చెట్ల కొమ్మల పైకి ప్రసరించేలా తూర్పు ,పడమర వైపు ఉన్న కొమ్మలను కత్తిరించాలని చెప్పారు. కోమ్మ కొత్తరింపుల అనంతరం కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రామూ లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. తరువాత పచ్చిరొట్ట ఎరువులుగా జనుము, జిలుగ,పిల్లిపేసర సాగుచేసి పూత దశలో భూమిలోకి కలియదున్నాలని సూచించారు.ఈ ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహా యకులు వరున్ కుమార్, హేమజ్యోతి రైతులు పాలొన్నారు.

ఆర్‌ఎంపి కేంద్రాల్లో డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని ఆర్‌ఎంపి ప్రాథమిక చికిత్స కేంద్రాలను గురువారం డిఎంహెచ్‌ఒ ఎన్.కొండయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎంపి వైద్యులు రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. సెలైన్ బాటిల్స్, యాంటీబయోటిక్స్, అధిక మోతాదులు ఉపయోగిస్తున్నారని ఇది చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఎవరైన ఆర్‌ఎంపిలు తమ పరిధికి మించి సెలైన్ బాటిల్స్, ఇంజక్షన్స్ వాడితే ప్రభుత్వం తీసుకునే చట్టపరమైన శిక్షలకు గురి అవుతారని అన్నారు. రోగులను అడ్మిట్ చేసుకొని వైద్య చేయకూడదని సూచించారు. ఆర్‌ఎంపిలు వైద్యారోగ్యశాఖ నిబంధనలను తప్పక పాటించాలని ఆదేశించారు.కార్యక్రమంలో స్థానిక వైద్యులు ఎస్ఎండి రఫీక్, రాధా మాధవి, ఎఎన్ఎంలు సుశీల, జ్యోతి, పలువురు పాల్గొన్నారు.



ఆర్‌ఎంపి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ కొండయ్య

జ్వరాల నియంత్రణకు చర్యలు



ప్రధాన రహదారిలో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎంపిడిఒ రామచంద్రారెడ్డి, ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో 12 గ్రామ పంచాయతీల్లోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, పర్యటిస్తూ అను మానితులకు రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఏ గ్రామంలో నైనా అనుమానం అనిపిస్తే అక్కడ డాక్టర్ మనీషా, డాక్టర్ జియావుల్ల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. గడికోటలో ఒకటి డెంగీ కేసు వస్తే అక్కడికి వైద్య అధికారులు వెళ్లి పరీక్షలు నిర్వహించి బాధితుడికి చికిత్స ఇచ్చారు. గ్రామాల్లోని తాగునీటి పథకాలను శుభ్రం చేయించడంతో పాటు క్లోరినేషన్ చేయి స్తున్నారు. పారిశుధ్య నియంత్రణపై పంచాయతీ సిబ్బందిని అప్ర మత్తం చేశారు.

మార్గదర్శకాలు జారీ చేశాం



దళిత, గిరిజన ప్రాంతాల్లో మురుగు కాలువలను శుభ్రం చేస్తున్నాం. రోడ్ల పైన నిలబడిన నీటిని తొలగిస్తున్నాం. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. నిల్వ ఉన్న వ్యర్థాలను తొలగింప చేస్తున్నాం. నీటి పథకాలను క్లోరినేషన్ చేస్తున్నాం. కాచి చల్లారిన నీటిని తాగాలని దండోరా ద్వారా ప్రచారం చేస్తున్నాం. సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు,మార్గదర్శి గారు జారీ చేస్తున్నాం.ప్రజలు కూడా పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి.

-రామచంద్రారెడ్డి, ఎంపిడిఒ

బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎంఇఒ



హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ మహిళ పాఠశాలలో గురువారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలకు పాఠశాల ప్రిన్సిపల్ రూతుమేరీ, అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల అభివృద్ధి అధికారి నరసింహమూర్తి, విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫోన్ చేసి బాల్య వివాహాలు నిర్మూలించాలని అన్నారు. మన దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల పూర్తయినప్పటికీ ఇంకా బాలవివాహాలు జరగడం చాలా బాధాకరమని బాల్యవివాహాల వల్ల అమ్మాయి, అబ్బాయి జీవితాలు నాశనం అవుతున్నాయని చెప్పారు. సచివాలయాల పరిధిలోని మహిళా పోలీసులు, పంచాయతీ సెక్రటరీలు, ఎఎన్ఎంలు, ఐసిడిఎస్ సిబ్బంది బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు అబ్బాయిలకి వివాహం చేస్తే పెళ్లి కుమారునికి వారి తల్లిదండ్రులకు పెళ్లిలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాలికను వివాహం చేసుకొని తనతో సంసారం చేసిన భర్తకు ఫోక్స్ చట్టం కింద పది సంవత్సరాలు జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందని అన్నారు. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకునే వయసులోనే వివాహం చేసి చిన్నారుల జీవితాను దుర్భరం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాల్యవివాహాలను అడ్డుకట్ట వేసేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట తెలిస్తే హెల్ప్ లైన్ నెంబర్‌ల ద్వారా వెంటనే సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలపాని సూచించారు. బాల్య వివాహం నేరం - చట్టం ప్రకారం శిక్షార్హులు , బాల్య వివాహం చేసిన.. చేసుకున్న.. ప్రోత్సహించిన రెండేళ్ల జైలు లక్ష రూపాయల జరిమానా అనే నినాదాలతో తల్లిదండ్రుల్లో విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బాల్యవివాహాలు చట్టవిరుదమని ఐసిడిఎస్ సిబ్బంది తెలియజేయడం జరిగింది.కార్యక్రమంలో ఎంఇఒ1 చక్రధర్‌రాజు, ఎంఇఒ2 నాగ తిరుమ లరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు మణెమ్మ, ఎం.జ యలక్ష్మి, వై.నిర్మలాదేవి అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



బిసిజి టీకాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

డయేరియా, డెంగీ, బిసిజి టీకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని మసీదు వీధి, అగ్ర హారంలలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ రమేష్ బాబు సూచనల మేరకు ప్రజలకు డయేరియా, డెంగీ పై వ్యతిరేక మాసోత్సావాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. బిసిజి టీకాలపై హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డిలు కలసి అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రతీ సోమ, గురు వారాలలో మండలంలోని ఆరోగ్య కేంద్రాల్లో అర్హులైన ఆరు వర్గాలవారికి బిసిజి టీకాలు వేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసు కోవా లని కోరారు. డయేరియా కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా చేతులు శుభ్రత పాటించాలని, తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని, వ్యక్తిగత, పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఒఆర్‌ఎస్ ప్యాకెట్స్ పిపె ాచ్‌సి, అంగ న్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒఆర్‌ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేయాలో వివరించారు. డెంగీ జ్వరాలు ప్రబల కుండా ఫ్రైడే డ్రైడేగా పాటించాలని, ఇంటి కిటికీలకు మెష్ కొట్టించుకోవాలని, ఇంటి పరి సరాలలో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. అనంతరం డయేరియా, డెంగీ, బిసిజి టీకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అర్హులైన వారికి బిసిజి వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు దేవేంద్ర, శశికళ, ఎఎన్ఎం లీలారాణి, గాయత్రీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

మలేరియా, డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నమయ్య జిల్లా జిల్లా సామాజిక ఆరోగ్య అధికారి డేవిడ్ సుకుమార్ పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్లు సమయపాలన పాటించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో గదులు, ఎక్స్‌రే ల్యాబ్, ఆరోగ్యశ్రీ గదులను పరిశీలించారు. ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, పోలీసులు

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ద్విచక్ర వాహన గారు ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టు జడ్జి పైజున్నిసా పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మూడు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్షణ లేని ప్రయాణం ప్రమాదకరమని ప్రతి వాహనదారుడు ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. అతివేగం ప్రమాద కరమని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణకులను ఆటోలో ఎక్కించుకుని అతివేగంతో ప్రయాణిస్తూ ప్రాణాలు మీదికి తెచ్చుకుంటున్నారని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమని అన్నారు. కార్యక్రమంలో సిఐ జీవన్ గంగానాథ్‌బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్, న్యాయవాదులు ఎంఎల్ రామ చంద్రారెడ్డి, చెన్న కృష్ణయ్య, కోర్టు సిబ్బందిపాల్గొన్నారు. **పీలేరు:** హెల్మెట్ ద్విచక్ర వాహన దారులకు ప్రమాదాల్లో ప్రాణ రక్షణను ఇస్తుందని పీలేరు సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. పోలీసులతో కలిసి న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు బిసిపురుషోత్తంరెడ్డి, న్యాయ వాదులు, మోహన్ రెడ్డి, ఎస్ఐ, ఆర్‌టిఒ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలని మండలం లోని న్యాయవాదులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ వారి సూచనల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎఫ్ఎసి సెక్రటరీ కె ప్రత్యూష కుమారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ నందిని ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలపై వన్‌కెవాక్ రన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో బార్ ప్రెసి డెంట్ ఎవి.సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు దాసరి నరసింహులు, మహ మ్మద్‌అలీ, ఆనంద్ కుమార్, సెమివుల్లా ఖాన్, సుబ్బరామయ్య, మోహన్, నూర్‌మహమ్మద్, నరేష్, పోలీసులు, పిఎల్‌విలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ మొక్క జొన్నలు పంపిణీ

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని చౌడసముద్రం పశువైద్యశాలలో సబ్సిడీ పశు గ్రాసం కోసం మొక్కజొన్న కిట్లను డాక్టర్ నివేదిత రెడ్డి పాడి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నివేదిత రెడ్డి మాట్లాడుతూ మంచి నాణ్యమైన, ఎక్కువ ధరలు కలిగిన రెండు రకాల మొక్కజొన్నలను ప్రభుత్వం పాడి రైతులకు అతి తక్కువ ధరలకు సబ్సిడీ రూపంలో ఇస్తుందని తెలిపారు. ఒక్కొక్క బ్యాగు ఐదు కిలోల మొక్కజొన్న విత్తనాలు కలిగి ఉంటుందని, రూ.325లు సబ్సిడీ పోను ఒక కిలో రూ.17లతో ఒక్క బ్యాగునూ రూ.85లకు ఎర్ర జొన్నలు వచ్చి 5 కిలోల బ్యాగు రూ.120లకు ఇస్తున్నారని తెలిపారు. ఈ జొన్న పంటల ద్వారా పశుగ్రాసం బాగా వేప్ుగా పెరిగి పాలు ఉత్పత్తి శాతం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామం లో ఉన్న పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ బుర్ర అరుణ, వెటర్నరి అసి స్టెంట్ సతీష్, గోపాల మిత్రలు చాన్‌బాషా, లక్ష్మీనారాయణ, రైతులు అనిల్, పెద్దన్న పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్ సీజ్

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తంబళ్లపల్లి మండల కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను అధికారులు సీజ్ చేశారు. గురువారం మధ్యాహ్నం తహశీల్దార్ బ్రహ్మయ్య ములకలచెరువు ఎస్ఐబి రామ్మోహన్, మైనింగ్ శాఖా సర్వేయర్ దుర్గాదేవి, టెక్నికల్ అసిస్టెంట్ జెబివి దేవి, విఆర్ఒ రమణలు ఆర్‌టిసి బస్టాండ్ పక్కన నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపును పరిశీలించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సీజ్ చేసిన ఇసుక దాదాపు 550.80క్యూబిక్ మీటర్ల వరకు ఉంటుందని, దీని విలువ రూ.3.5లక్షల వరకు ఉంటుందన్నారు. ఇసుకను స్థానిక ఓవైసిపి నాయకుడు గ్రామంలో కాలువల నిర్మాణం చేపట్టడానికి డంప్ చేసినట్లు తెలిపారిని అయితే ఇసుకకు సంబంధించిన ఎటువంటి బిల్లులు చూపించకపోవడంతో సీజ్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, విఆర్ఒలు, విఆర్ఎ పాల్గొన్నారు



సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న వరలక్ష్మి

సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల దగ్గర గురువారం రైల్వే కోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి, తనయుడు ముక్కా విశాల్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.12లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పన చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. సిసి రోడ్డు నిర్మాణానికి రూ.12 లక్షలు, క్రీడ మైదానం చదును కోసం రూ.2లక్షలు, స్టేజ్‌కు బండల కొరకు రూ.3లక్షలు, స్టేజికి రేకుల కొరకు రూ.2లక్షలలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ప్రధాన అజెండాగా ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్డు కల్పన, మౌలిక వసతులు, తాగునీరు, ప్రతి గ్రామానికి విద్యుత్, అందించి ప్రజలను సంతోష పరచడమే తమ కర్తవ్యమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామంలో అయినా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రజల కోసం ప్రజల కష్టాలు తెలుసుకొని తీర్చడంలో తమ కుటుంబం నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటీ, ఫిజికల్ డైరెక్టర్ శారద, ప్రిన్సిపల్ హరిత, ప్రసాద్, రమణ రాజు, కళాశాల ఉపాధ్యాయ బృందం, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'హంస' జిల్లా అధ్యక్షులుగా పుల్లంరాజు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

హెల్త్ అండ్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా పుల్లంరాజు నియమితులయ్యారు. మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న పుల్లంరాజు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె తాలూకా ఇన్‌ఛార్జిగా ఉండేవారు. ప్రస్తుతం జిల్లాల విభజన నేపథ్యంలో అన్నమయ్య అధ్యక్షులుగా పుల్లంరాజు ను నియమిస్తూ చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-ములకలచెరువు

సమాజంలో యువత రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలువాలని ములకలచెరువు సిఐ మధు, ఎస్ఐ తిప్పేస్వామి, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపిడిఒ పోలప్ప పేర్కొన్నారు. గురువారం ములకలచెరువు సమీపంలోని కేజిఎన్ ఫంక్షన్ వద్ద కోనంగి శ్రీనివాసులు కుమారుడు డాక్టర్ కల్యాణ్ రెండో వర్ధంతి సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 52మంది యువకులు, అధికారులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సిఐ, ఎస్ఐ, ఓఆర్ ఎస్, పండ్లు అందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డాక్టర్ కళ్యాణ్ పేరుతో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషదాయకం అన్నారు. ప్రస్తుత సమాజంలో రక్తదానం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడుకోవచ్చునని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ పోలప్ప రక్తదానం చేసి ఆదర్శప్రాయంగా నిలిచారు. కార్యక్రమంలో కోనేటివారిపల్లి సర్పంచ్ జయ చంద్రకుమార్, ట్రస్ట్ సభ్యులు ప్రశాంత్, కోనంగి శ్రీనివాసులు, మస్తాన్, కోనంగి హరీష్, కోనంగి చంద్ర, జరిపిటి నాగేంద్ర, ఇడగొట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆస్తిలో వాటా కోసం తండ్రిని హత్యచేసిన తనయుడు

- కారుతో ఢీకొట్టి హతమార్చిన వైనం
- కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



కొడుకు చేతిలో హత్యకు గురైన చిన్న రెడ్డెప్పరెడ్డి

కుమారుడి చేతిలో ఓ తండ్రి హతమయ్యాడు. ఆస్తి పంపకాలు చెయ్యకపోగా వాటా ఇవ్వలేదనే కక్షతో కారుతో ఢీకొట్టి హతమార్చాడు. ఈ విషాదకర సంఘటన బుధవారం రాత్రి మదనపల్లెలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని నీరుగట్టు వారిపల్లె రామాలయం వీధికి చెందిన చిన్నరెడ్డప్పరెడ్డి (65) వ్యవసాయ రైతుతో పాటు వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. ఈయనకు భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు రఘునాథరెడ్డి, శంకర్ రెడ్డిలు ఉన్నారని అన్నారు. రఘునాథరెడ్డి గతంలో ఓ ప్రయివేట్ కళాశాల లెక్చరర్‌గా పనిచేస్తుండగా, శంకర్ రెడ్డి కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడని చెప్పారు. ఉద్యోగం పోగొట్టుకొని ఖాళీగా ఉన్న రఘునాథరెడ్డి ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా వ్యాపారాలు నిర్వహిస్తూ మొత్తం రూ.16లక్షలు అప్పు చేశాడని అన్నారు. సకాలంలో అప్పులు చెల్లించ కపో వడంతో రుణదాతల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. ఈ క్రమంలో ఆస్తి పంపకాలు చేసి తన వాటా ఇవ్వాలని కొద్దిరోజులుగా తండ్రిని వేధించేవాడని అన్నారు. చంద్రకళ సైతం కుమారులకు ఆస్తి పంప కాలు చెయ్య మని కోరిందని అన్నారు. భార్యతో కూడా చిన్నరెడ్డెప్పరెడ్డి గొడవ పెట్టుకున్నాడని అన్నారు. ఈ క్రమంలో ఆమె బెంగుళూరు లో ఉన్న చిన్న కుమారుడి వద్దకు వెళ్లిపోయిందని తెలిపారు. తండ్రి, కుమారుడు మధ్య ఆస్తి వివాద గొడవలు మరింత ముదరడంతో తండ్రిపై కక్ష పెంచుకున్నాడని అన్నారు. బుధవారం సాయంత్రం చిన్నరెడ్డప్పరెడ్డి స్థానిక బైపాస్ రోడ్డులో వాకింగ్ చేస్తుండగా పథకం ప్రకారం రఘునాథరెడ్డి తన కారుతో ఢీకొట్టి హత్య చేశాడని అన్నారు. అనంతరం మృతదేహాన్ని తీసుకెళ్లి వీవర్స్ కాలనీలో పడేసి, జరిగిన ఘటన గూర్చి బెంగుళూరులో ఉన్న తమ్ముడు శంకర్‌రెడ్డికి ఫోన్ చేసి చెప్పాడని తెలిపారు. అతను హుటా హుటిన మదనపల్లెకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించడంతో హత్య ఉదంతం వెలుగులోకి వచ్చిందన్నారు. టూటౌన్ పోలీసులు సంఘటన చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై ఆరా తీసినట్లు చెప్పారు. ఆస్తిలో వాటా ఇవ్వలేదనే కక్షతో రఘునాథరెడ్డి తన తండ్రిని హత్య చేశాడని చిన్న కుమారుడు శంకర్ రెడ్డి ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో వెలుగు చూసింది. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం, పెంచిపాడుకు చెందిన నారాయణ, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు కృష్ణమూర్తి(37)కు భార్య అనురాధ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే కృష్ణమూర్తి కొన్నాళ్ల క్రితం కుమార్తెకు వివాహం చేశాడు. అనంతరం ఏడాది క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య అనురాధ భర్తను వదిలి కుమారుడిని వెంట తీసుకొని బెంగళూరుకు వెళ్లిపోయింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణమూర్తిని తల్లి సంరక్షించింది. ఈ నేపథ్యంలో ఒంటరి జీవితంపై విరక్తి చెందిన కృష్ణమూర్తి మదనపల్లె ఆర్‌టిసి బస్టాండ్ వద్దకు వచ్చి విష ద్రావణం తాగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ సిఐ యువరాజు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి స్థానిక సర్వజన బోధనాసుపత్రి మార్చురికి తరలించారు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.